ఆరెంజ్ జోన్‌లో సిరిసిల్ల 8

నేతన్నలను పట్టించుకోని బీజేపీ, బీఆర్‌ఎస్ 7

‘పొన్నం’ తిట్లను దీవెనలుగా భావిస్తా

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్



బోయినపల్లిలో మాట్లాడుతున్న బండి సంజయ్

బోయినపల్లి, ఏప్రిల్ 27: మంత్రి పొన్నం ప్రభాకర్ తిట్లను దీవెనలుగా భావిస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం బోయినపల్లిలో నిర్వహించిన బీజేపీ పన్నా ప్రముఖుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే మంత్రి పొన్నం తనను వెధవ అంటూ తిడుతున్నారన్నారు. పొన్నం తనను వెధవ అంటే తన దృష్టిలో 'వెయ్యేళ్లు ధనికుడిగా వర్ధిల్లు' అని అర్థమన్నారు. ఓడిపోతామని తెలిసే ఓటుకు వెయ్యిరూపాయలు ఇచ్చి గెలవాలని కాంగ్రెస్ అభ్యర్థి ప్రయత్నిస్తున్నారన్నారు. గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ చేసిన మోసాలతో పాటు గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన ద్రోహాన్ని వివరించి బీజేపీకి ఓటేయించాలని కోరారు. దేశమంతా నరేంద్రమోదీ గాలి వీస్తున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ కార్యకర్తలంతా పోలింగ్ బూత్‌ల పరిధిలోని తటస్థ ఓటర్లతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. నూటికి నూరుశాతం ఓట్లు వేయించే పోలింగ్ బూత్ బాధ్యులను తాను స్వయంగా సన్మానిస్తానన్నారు. ఎన్నికల నాటికి ప్రతి కార్యకర్త ఇంటింటికీ మూడు సార్లు వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. తద్వారా అత్యధిక మెజారిటీతో గెలుపొందుతామని, కరీంనగర్ ప్రజా తీర్పును దేశానికి చాటి చెప్పి చరిత్ర సృష్టిద్దామని అన్నారు. మోదీ పాలనలో దేశాభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారం కోసం విప్లవాత్మక చర్యలు తీసుకున్న ఘనత నరేంద్రమోదీదే నన్నారు. మొన్నటిదాకా బోయినిపల్లిలో ఒక కుటుంబం అరాచకంగా వ్యవహరించిందని, కొందరు పోలీసులు వారికి వత్తాసు పలికారని అన్నారు. ఇప్పుడు ఆ కుటుంబం పరారీలో ఉందని, వత్తాసు పోలీసుల పరిస్థితి ఇబ్బందిగా మారిందని అన్నారు. ఆనాడూ భైంసాలో దారుణాలు జరిగినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో వెనుకంజ వేయబోనని, అందరికీ అండగా ఉంటానని అన్నారు. కేసీఆర్ పాలనలో అరెస్ట్ చేసినా భయపడకుండా పోరాడానని, వందల కేసులు నమోదు చేసినా వెనుకంజ వేయలేదని అన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఘోరంగా ఓడిపోతున్నాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా మోదీపట్ల సానుకూలంగా ఉన్నారని అన్నారు. వారిని కలిసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి లేఖలు రాయడం తప్పా సాధించేదేమీ లేదన్నారు. తాను చేసిన అభివృద్ధి, తెచ్చిన నిధులను బీఆర్ఎస్ అభ్యర్థి ఖాతాలో వేసుకుంటున్నారన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణానికి నిధులు తీసుకురాలేదన్నారు. తాను సేతు బంధన్ స్కీం కింద నిధులు తెచ్చి ఆర్వోబీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల విస్తరణ కోసం వేలాది కోట్లు తీసుకొస్తే తన లేఖలవల్లే వచ్చాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. ధాన్యానికి బోనస్ ఇవ్వడానికి, తరుగు, తాలుతో సంబంధం లేకుండా కొనడానికే డబ్బులు లేనోళ్లు రూ.2 లక్షల రుణమాఫీకి రూ.30 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అక్కసుతో తనను బూతులు తిడుతున్నారని, పట్టించుకోవాల్సిన అవసరమే లేదని అన్నారు. ఎందుకంటే ఆయన వద్దకు పోవాలంటే ఆ పార్టీ కార్యకర్తలే భయపడుతున్నారన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించి బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ నాయకులు అల్లాడి రమేష్, మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఊదారి నరసింహచారి పాల్గొన్నారు.



కరీంనగర్‌లో వాకర్స్‌తో కలిసి నడుస్తున్న బండి సంజయ్



కండువాలు కప్పి నాయకులకు పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

కరీంనగర్,(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే రెండు పార్టీలు ఒక్కటై తనను ఓడించేందుకు కుట్ర చేస్తున్నాయని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కలుగులోని ఎలుక అని, ఎన్నికలప్పుడుమాత్రమే బయటకు వస్తాడని, ఆ తర్వాత ఫాంహౌస్‌కే పరిమిత మవుతాడని ఎద్దేవా చేశారు. బీజేపీని పాకిస్తాన్ టీంగా ముఖ్యమంత్రి అభివర్ణించ డాన్ని తప్పుబట్టారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముస్లిం ఓట్లను కొల్ల గొట్టేందుకు తమది ముస్లిం పార్టీ అని తుమ్మల నాగేశ్వర్‌రావు చెబుతున్నారంటే ఎవరిది పాకిస్తాన్ జట్టో ప్రజలకు అర్థమయిపోయిందన్నారు. బీజేపీ భారతీయ ఆత్మ అని, హిందుత్వ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న పార్టీ అన్నారు. ఫైట ర్స్.. చీటర్స్.. లూటర్స్‌కు జరగుతున్న పోరులో ఫైటర్స్ పార్టీ బీజేపీ గెలుస్తుందన్నారు.

కాంగ్రెస్ వచ్చాక ధరలు పెరిగాయి

- కాంగ్రెస్, బీజేపీ కుట్ర రాజకీయాలకు చరమగీతం పాడాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



కరీంనగర్‌లో ప్రచారం చేస్తున్న హరీశ్‌రావు, వినోద్ కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వస్తువుల ధరలు పెరిగాయి సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్‌లో ఆయన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ బస్ యాత్రతో కాంగ్రెస్ పీఠం కదులుతోందని, ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరీంనగర్‌లో రోజూ ఇచ్చే తాగునీళ్ల రెండురోజులకొకసారి ఇస్తున్నారని, మురికి నీరు వస్తుందని చెబుతున్నారని, కరెంటు కోతలు మొదలయ్యాయ న్నారు. ఐదేళ్ల కేసీఆర్ పాలనలో రోజు నీళ్ల ఇస్తే ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నార న్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి చరమ గీతం పాడాలని ప్రజలను కోరారు. ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకు వచ్చారని, కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వే లైనును పరుగు పెట్టించారని తెలిపారు. మేధావి, అభివృద్ధి, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వినోద్ కుమార్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఎంపీ బండి సంజయ్ ఒక్కటైనా సాధిం చారా అని ప్రశ్నించారు. కనీసం ఆ పార్టీ కార్యకర్తలకు కూడా ఏమి చేయలేదని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధి, ప్రజలకు మేలు జరిగేందుకు మేధావులు ఆలోచించి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు.

● బీజేపీ, కాంగ్రెస్‌వి కుమ్మక్కు రాజకీయాలు

శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కయ్యాయని, మోదీ సర్కార్ రిజర్వేషన్లను తొలగిస్తే బీఆర్ ఎస్ మద్దతిస్తుందంటూ చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు. ఆరు గ్యారెంటీల గురించి, నాలుగున్నర నెలల పాలన గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడడం లేదన్నారు. బీజేపీతో కుమ్మక్కై దొంగేదొంగ అన్నట్లుగా రేవంత్‌రెడ్డి వ్యవ హరిస్తున్నాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలా కర్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



వాకర్స్‌తో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

● బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిచాలి

జమ్మికుంట: పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుక వినబడాలంటే తమ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. శనివారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో తో కలిసి వాకర్స్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఐదు రూపాయాలు కూడా తీసుకు రాలేదన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే సింగాపూర్‌లోని ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలాజికల్ ఎడ్యూకేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కరీంగనర్‌కు తీసుకు వస్తానన్నారు.



కరీంనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, వినోద్‌కుమార్

కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, గెల్లు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ పాల్గొన్నారు.

● పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక వినోద్‌కుమార్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్: ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న బోయినపల్లి వినోద్‌కుమా ర్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే పార్లమెం ట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే కమలాకర్ నివాసంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా కమలాకర్ మాట్లాడుతూ వినోద్‌కుమార్ ఎంపీగా గెలిస్తే నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ పాల్గొన్నారు.

నేత కార్మికుడి కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 27: ఆత్మహత్యకు పాల్పడిన నేత కార్మికుడు అంకారపు మల్లేశం కుటుంబాన్ని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పరామర్శించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరనగ ర్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పూర్మాణి మంజులలింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, జిల్లా నాయకులు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజ్, వైద్య శివప్రసాద్, కాముని వనిత తదితరులు ఉన్నారు.

● దీపాదాస్ మున్షీకి ఘన స్వాగతం..

తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగ తం పలికారు. దీపాదాస్ మున్షీని జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి, మహిళ నాయకురాళ్లు కాముని వనిత, హరిక రెడ్డి, శ్రీదేవి, అరుణ తదితరులు సన్మానించారు.



దీపాదాస్ మున్షీకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకురాళ్లు

కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే

- మంత్రి పొన్నం ప్రభాకర్

బోయినపల్లి, ఏప్రిల్ 27: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమి అత్యధిక స్థానాలు గెలుపొందుతుందని రాహుల్‌గాంధీ ప్రధా నమంత్రి అవడం తథ్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయిన పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలి చాల రాజేందర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సౌమ్యుడైన వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలి పించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేర వేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కు తుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్ప దండి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు అత్యధి కమెజార్టీ అందించాలని కోరారు. కార్యక్ర మంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంప ల్లి సత్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్య క్షుడు కూస రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనుగుల కనకయ్య, మండల శాఖ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు ఆగయ్య, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, దుమాల, నారాయణపూర్ తదితర గ్రామాల్లో శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల గొంతుక వినిపించా లంటే బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో అమలు చేసిన పథకాలు, చేపట్టిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్‌కుమా ర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీ సీలు నాగరాణి, అనసూయ, గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, అపెరాసుల్తానా, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 27: జిల్లాలో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణ పకడ్బందీగా నిర్వహిం చాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాగ్ జ యంతి మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకుపోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో హోమ్ ఓటింగ్ ద్వారా 233 మంది వృద్ధులు, 51 మంది దివ్యాంగులు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 734 మంది ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును విని యోగించుకోనున్నారని తెలిపారు. వీరికి మే 3 తేదీ నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా, మే 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగిం చుకునే అవకాశం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. సిరిసిల్ల లోని గీతానగర్ ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్, వేములవాడలో న్యూ లైబ్రరీ బిల్డింగ్ నందు పోస్టల్ బ్యాలెట్ బూత్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. హోమ్ ఓటింగ్‌లో గోప్యతను పాటిం చాలని నిర్ణీత నమూనా ఫారాలలో సమాచారాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి గౌతమి, ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం , సీపీవో శ్రీనివాసాచారి, ప్రభుత్వ టీచర్లు ,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 27: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో శనివారం వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణుల పోషకలోపాలను, రక్తహీనతను తొలగించే దిశగా ఐరన్ మందులు, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అధిక ప్రసవాలు జరిగే విధంగా వైద్య సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పసిపిల్లలకు అందించే ఇమ్యూనైజేషన్ ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు. పిల్లల ఎదుగుదల లోపాలు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. టీబీ లక్షణాలు గల వారిని గుర్తించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తిచేసి అవసరమైన వారికి చికిత్స అందించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళాకేంద్రాల ద్వారా మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ కేంద్రం, డయాలసిస్ కేంద్రాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగహన కల్పించాలని వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్, ఉప వైద్యాధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సోదరుల మధ్య ఘర్షణ .. తమ్ముడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో శనివారం ఇద్దరు సోదరులు ఘర్షణ పడగా తమ్ముడు కాల్వ వెంకటేష్‌యాదవ్(28) మృతి చెందాడు. గ్రామస్థులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాల్వ వెంకటేష్, కాల్వ శ్రీనివాస్‌లు అన్నదమ్ములు. మద్యానికి బానిసైన ఇద్దరు సోదరులు ఎలాంటి పనులు చేయకుండా తరచుగా గొడవపడుతుంటారు. వారి తండ్రి రాయమల్లు గొర్లకాపరిగా పనిచేస్తుంటాడు. శనివారం సాయంత్రం అన్నదమ్ముల మధ్య గొడవ జరగ్గా శ్రీనివాస్ ఇంటిలోని ఈలపీటతో వెంకటేష్ నడుం భాగంలో కొట్టాడు. దీంతో ఆగ్రహంతో శ్రీనివాస్‌ను వెంకటేష్ కొట్టేందుకు రాగా అతన్ని నెట్టివేయడంతో భవనం పిల్లర్‌కు తల తగిలింది. దీంతో వెంకటేష్ చెవుల నుంచి రక్తం కారి కొద్దిసేపటికి మరణించాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

760 లీటర్ల మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలలో బెల్ట్ షాప్‌లపై దాడులుచేసి రూ. 4.60 లక్షల విలువైన 760 లీటర్ల మద్యంను సీజ్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన 96 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ 109 మందిపై కేసులు నమోదు చేసి రూ .5.17లక్షల విలువైన 957 లీటర్ల మద్యం సీజ్‌చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్‌లు, కిరాణ దుకాణాల్లో, ఇతర ఇళ్లల్లోనూ ఎవరైనా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి

కథలాపూర్, ఏప్రిల్ 27: మండలంలోని దుంపెట శివారులో వరద కాలువ వద్ద శనివారం కారు ఢీకొట్టిన ఘటనలో చుక్కల దుప్పి మృతి చెందింది. సెక్షన్ అధికారి మల్లేశం కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన అనుప రాజేశ్ టీఎస్ 21 సీ 8991 నంబర్ గల కారులో తన స్వగ్రామం వెళ్తుండగా అటువైపు నుంచి వేగంగా వచ్చిన దుప్పిని ఢీకొట్టాడు. గాయాల పాలై అపస్మారక స్థితికి చేరిన దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కారును సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: ధాన్యం కుప్పలను బైక్ ఢీకొన్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఎర్పుల రాములు తీవ్ర గాయాలపాలయ్యాడని సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. రోడ్డుపై ధాన్యం కుప్పలు పోసి ప్రమాదానికి కారణమైన కిష్టునాయక్‌తండాలోని రైతు భూక్య నరేశ్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రాములు తన ద్విచక్ర వాహనంపై ఈ నెల 26న సాయంత్రం గొల్లపల్లికి వెళ్లి రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో రహదారిపై ఉన్న ధాన్యం కుప్పలను ఢీకొట్టాడని చెప్పారు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని వివరించారు. బాధితుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు రోడ్డుకు అడ్డుగా ధాన్యం కుప్పలు పోసిన రైతు నరేశ్‌పై ఎస్‌ఐ రమాకాంత్ కేసు నమోదు చేయగా దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

● ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్- కోరుట్లపేట గ్రామ శివారులోని రహదారిపై ఉన్న వరి ధాన్యం కుప్పను ద్విచక్రవాహనంతో శనివారం రాత్రి ఢీకొన్న సంఘటనలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజనర్సు తీవ్ర గాయాలపాలయ్యాడు.

జగిత్యాలలో రెండిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 27: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న ఆదర్శనగర్‌లో రెండిళ్లలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆదర్శనగర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి, కోటి అనే ఇద్దరు వ్యక్తులకు చెందిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.61 వేల నగదును అపహరించుకవెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 27: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 24న రాత్రి గ్రామంలో హరీష్ అనే వ్యక్తి తన బంధువులతో సహా డ్యాన్స్ చేస్తుండగా అటువైపుగా వెళ్లిన మ్యాకల ఉదయ్ అనే వ్యక్తిని ఆపి చేతులతో కొట్టి, కులం పేరుతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ రావు శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షులను విచారించారు.

కంబోడియా కేంద్రంగా సైబర్ మోసాలు

● చైనీస్ కంపెనీ పేరిట కాల్ సెంటర్ ● ఇద్దరి ఏజెంట్ల అరెస్టు, మరో ఇద్దరికి లుక్ అవుట్ నోటీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 27: కంబోడియా కేంద్రంగా చైనీస్ కంపెనీ పేరిట సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా వ్యవహారాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్ చేసి మరో ఇద్దరికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి తన కుమారుడు శివప్రసాద్‌ను గల్ఫ్ పంపేందుకు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్ అనే ఏజెంట్‌ను కలిసింది. ఇందుకోసం రూ.1.40 లక్షలు ఇచ్చింది. ఏడాది క్రితం శివప్రసాద్‌ను కంబోడియా పంపించిన ఏజెంట్ సైబర్ మోసాలకు పాల్పడే కాల్‌సెంటర్‌లో పని ఇప్పించాడు. ఇండియాకు చెందిన ఫోన్ నంబర్లకు కాల్ చేసి సైబర్ మోసం చేయమంటూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని శివప్రసాద్ తన తల్లి ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చాడు. లక్ష్మి ఫిర్యాదుతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చైనీస్‌కు చెందిన కంపెనీలో శివప్రసాద్ పాస్‌పోర్ట్ తీసుకున్నట్లు, సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడితోపాటు ఇండియాకు చెందిన 600 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే కంబోడియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడినట్లు, బాధితుడి వివరాలు పంపించి అక్కడి పోలీసుల సహాయంతో రెస్క్యూ చేసి శివప్రసాద్‌ను కాపాడినట్లు ఎస్పీ చెప్పారు. శివప్రసాద్ రెండు రోజుల్లో సిరిసిల్లకు చేరుకుంటాడని, మిగతా బాధితులను ఇండియాకు పంపించే ఏర్పాట్లు చేశామని ఎస్పీ వివరించారు.

ఉపాధి పేరిట సైబర్ మోసాలకు పాల్పడే కాల్ సెంటర్‌లో ఉద్యోగం పెట్టించి మోసం చేసిన ఏజెంట్లు జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామానికి చెందిన కంచర్ల సాయిప్రసాద్, మహారాష్ట్రలోని పూణేకు చెందిన అబిద్ అన్సరీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

● కమీషన్‌ల కోసం ఏజెంట్ల దందా

కమీషన్‌ల కోసం ఏజెంట్లు దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. కంబోడియా ఏజెంట్‌గా పనిచేసిన సాయిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితుడు ఇచ్చిన మొత్తంలో సాయిప్రసాద్ రూ.10వేల కమీషన్ తీసుకొని లక్నోకి చెందిన సదాకత్ అనే వ్యక్తికి పంపిస్తాడు. ప్రస్తుతం మాల్దీవ్స్‌లో ఉంటున్న సదాకత్ రూ.10వేల కమీషన్ తీసుకొని పూణేకు చెందిన అబిద్ అన్సరీకి పంపిస్తాడు. అతను దుబాయ్‌లో ఉంటున్న బీహార్‌కు చెందిన షాదబ్ అనే వ్యక్తికి మిగిలిన మొత్తంతో పాటు, పాస్‌పోర్టు పంపిస్తే కంబోడియా దేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తాడని విచారణలో వెల్లడైనట్లు ఎస్పీ చెప్పారు. దీంతో కంచర్ల సాయిప్రసాద్, అబిద్ అన్సరీ అనే ఏజెంట్లను అరెస్ట్ చేశామని, సాయిప్రసాద్‌ను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. అబిద్ అన్సరీకి నోటీసులు ఇచ్చి పంపామని, పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. గల్ఫ్ ఉద్యోగాల పేరిట ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే 8712656411కు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు నిధి ఆప్కే నికత్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 27: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం, ఈఎస్ఐసీ సంయుక్తంగా ఈనెల 29న ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు నిధి ఆప్కే నికత్-2 (పీఎఫ్ మీ ముంగిట) జిల్లా అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కమిషనర్ సెల్వట్కర్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగునూరు ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)లో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాకు సంబంధించి సుల్తానాబాద్ రఘురామ్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, జగిత్యాల జిల్లా కోరుట్ల మోసాక్ బీడి వర్క్స్‌లో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు సంబంధించి తంగళ్లపల్లి ఠాకూర్ వైఎస్ బీడీ వర్క్స్‌లో, మంచిర్యాలలో కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో, ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్‌లో నలంద డిగ్రీ కళాశాలలో, నిర్మల్‌లో ఎస్‌టి థామస్ స్కూల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్షనర్లు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

వరిపంట దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 27: మండలంలోని మల్యాల గ్రామ శివారులో ఆ గ్రామానికి చెందిన రైతు పంజాల శంకరయ్య కోతకొచ్చిన ఎకరంన్నర వరి శనివారం అగ్నికి ఆహుతి అయింది. పొలం దగ్ధమై సుమారు లక్ష రూపాయల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. వరి పొలం ప్రమాదవశాత్తు కాలిందా ఎవరైనా అంటు పెట్టారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కక్షతోనే వరి పంటకు నష్టం చేశారని బాధితుడు తెలిపారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి, ఏప్రిల్ 27: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా 2,41,760 రూపాయల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. జిల్లాలోని జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లారపు శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద లక్ష రూపాయలు, మంచిర్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన తాళ్ల సతీష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 61 వెయ్యి 760 రూపాయలు, అదే గ్రామానికి చెందిన ఎడ్ల గణేష్ వద్ద 80 వేల రూపాయలను సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అందించినట్లు ఎస్సై తెలిపారు.

● ఇల్లందకుంట : మండలంలోని సిరిసేడు గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.1.50లక్షలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సిద్దిపేటకు చెందిన పృథ్వీరాజ్ అనే అతను ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు సీఐ కిశోర్ పేర్కొన్నారు. ఎస్‌ఐ రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

వీణవంక, ఏప్రిల్27: మండలంలోని బేతిగల్‌లో చొప్పరి తిరుపతి అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ చేసిన 2,400 రూపాయల విలువ చేసే బ్రాందీ, విస్కీ పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేతన్నలను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్

● పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్లు పరిపాలించినా పవర్‌లూం నేత కార్మికులు, పద్మశాలి సమాజాన్ని పట్టించుకోలేదని, రెండు పార్టీలు శవ రాజకీయాలు చేస్తున్నాయని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి, తంగళ్లపల్లిలో అంకారపు మల్లేశం కుటుంబాలను, కాంగ్రెస్ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్, సిరిసిల్లకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సిరిసిల్ల నేత కార్మికులు, పద్మశాలి సమాజానికి ఏమీ చేయలేదని అన్నారు. బీజేపీ వస్త్ర పరిశ్రమకు 12 శాతం జీఎస్టీ వేసిందని అన్నారు. 26 వేల మరమగ్గాలపై పేద నేత కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ ఆర్డర్లకు సంబంధించి రూ.275 కోట్ల బకాయిల బిల్లులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెల్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పవర్‌లూం పరిశ్రమ కోసం కొత్త పాలసీ తీసుకవస్తుందని అన్నారు.

పొలిమేర వరకు తరిమికొడతాం : మంత్రి పొన్నం

శవ రాజకీయాలు చేస్తూ పది సంవత్సరాలు అధికారంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే పరిస్థితి వస్తే తప్పులు, అప్పులు చేసిన వారిని పొలిమేర వరకు తరిమికొడతామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్యలు దురదృష్టకరమని అన్నారు. గత ప్రభుత్వంకు కేవలం బతుకమ్మ చీరలపై ధ్యాసే ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 1 ద్వారా బట్ట ఆర్డర్లు తెలంగాణ వ్యాప్తంగా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, అకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్యశివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య దీపదాస్‌కు వినతిపత్రం అందించారు.


తంగళ్లపల్లిలో కార్మిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న దీపదాస్ మున్షీ

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అవినీతిమయం

● గంగాధరలో ఏసీబీకి చిక్కిన ఎస్ఆర్‌వో
● గతంలో స్టాంపుల కుంభకోణంలో సస్పెండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27 : స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో లంచాలు లేనిదే ఏ ఫైల్ కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఇళ్లు, ఇంటిస్థలాలు, భూములు, మార్టిగేజ్, తదితర రిజిస్ట్రేషన్‌లు జరగాలంటే అధికారులకు లంచాలు ముట్టాల్సిందే. తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శివారపు సురేష్‌బాబు నెల రోజుల కిందటే గంగాధర ఇంచార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా వెళ్లి శనివారం కార్యాలయం అటెండర్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గతంలో సురేష్‌బాబు స్టాంపుల కుంభకోణంలో నిందితుడిగా ఉండి ఒకసారి సస్పెండ్‌కు కూడా గురయ్యాడు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పురాలేదని విమర్శలు వస్తున్నాయి.

● ఎస్ఆర్‌వో సురేష్‌బాబు ఇంటిలో ఏసీబీ సోదాలు

లంచం డబ్బులు తీసుకుంటూ ఏసీబీ పోలీసులకు పట్టుబడిన ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబును గంగాధరలో కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ పోలీసులు కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి 12 లక్షల 30 వేల నగదుతోపాటు 350 గ్రాముల బంగారు ఆభరణాలను, ఇతర కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబు, కొత్తకొండ శ్రీధర్‌లను ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరుస్తామని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి తెలిపారు.

● స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ, ఆర్టీఏ, అటవీశాఖతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఇదే విధంగా ప్రభుత్వ అధికారులు వారి కార్యాలయాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్స్, కాంటాక్టు ఉద్యోగులతో లంచాలు డబ్బులు తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖకు పట్టుబడ్డారు. లంచం డబ్బులు తీసుకుంటూ ఇటు ఉద్యోగం, అటు కోర్టు కేసులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.


ఎస్ఆర్‌ఓ సురేష్‌బాబు ఇంటిలో సోదాలు చేస్తున్న ఏసీబీ పోలీసులు

బావిలో పడి వృద్ధురాలి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 27: మానకొండూర్ గ్రామానికి చెందిన బొల్లం శివమ్మ (85) అనే వృద్ధురాలు శనివారం బావిలో పడి మృతి చెందింది. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయింది. శనివారం శివమ్మ తన రెండో కుమారుడు బొల్లం శంకర్ ఇంటిలోని చేద బావిలో పడి ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. బావిలో నుంచి బయటికి తీయగా అప్పటికే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 27: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శనివారం జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 25 మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా అందులో ఒక వ్యక్తికి 7 రోజులు, మరో వ్యక్తికి 5 రోజులు, ఆరుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్షతో పాటు మొత్తం 16,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 17 మందికి 25 వేల రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఖనిలో రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గోదావరిఖని వేదికైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీపడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్లు మధ్య జరిగి న మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొం దింది.

ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్‌పి నాయుడు, కోశాధికారి సామాల సత్యనా రాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

● పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని అందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మిషన్‌భగీరథ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. శనివారం జిల్లాలోని రుద్రవరం ఇంటెక్‌వెల్, అగ్రహారం నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోనీటి నిల్వ పూర్తి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 5.90 టీఎంసీలకు తగ్గడం వల్ల వేసవిలో మిషన్‌భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి అవసరాలు, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మూడు నెలలకు 0.36 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని ప్రస్తుతం 4 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు సమృద్ధిగా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, మిషన్‌భగీరథ సీఈ అమరేంద్ర, ఎస్ఈ రవీందర్, ఈఈలు విజయ్‌కుమార్, జానకి తదితరులు ఉన్నారు.


నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా

రాజన్న సేవలో సందీప్ కుమార్ సుల్తానియా

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమిలతో కలిసి ఆయన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము గావించారు.

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్27: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ పరిధిలో ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి శనివారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 30నుంచి 40సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిన దశలో ఉందని, మృతుడు నలుపురంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు ఎలగందుల గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్27: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణ పతి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు.



క్యూలైన్‌లో భక్తులు

లక్ష్మీనగర్‌లో కుక్కల స్వైర విహారం

● ఆరుగురు చిన్నారులపై దాడి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: గోదావరిఖనిలో పిచ్చి కుక్కల స్వైర విహారం ఆగడం లేదు. వారం రోజుల క్రితం మార్కండేయకాలనీలో ఎనిమిది మందిపై దాడి చేయగా శనివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పిచ్చి కుక్కలు ఆరుగురు చిన్నారులపై దాడికి పాల్పడ్డాయి. ప్రహన్య, చక్రికశ్రీ, నిత్య మరో ముగ్గురు చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయాలపాలైన చిన్నారులను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రాత్రివేళల్లో కుక్కలు నడిచి వెళ్లేవారిపై, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గత ఏడాది ఎల్‌బీనగర్‌లో కుక్కలు మోటార్ సైకిల్‌పై వెళుతున్న హమాలీని వెంబడించగా వాహనం అదుపు తప్పి కార్మికుడు మృతి చెందాడు. అయినా కార్పొరేషన్ అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. గుంపులు గుంపులుగా కోతులు, కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న కొండ దేవయ్య

వేములవాడ, ఏప్రిల్ 27: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య సన్మానించారు. శనివారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రాన్ని మంత్రి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సందర్శించారు. సత్రం ట్రస్టీలు కూరగాయల మల్లేశం, కొండా లక్ష్మణ్, కొమురయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

రుద్రంగి, ఏప్రిల్ 27: ప్రజల తరుపున కొట్లాడే బీఆర్‌ఎస్‌ను ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రుద్రంగి మండలం మానాలలో శనివారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటు వేయద్దన్నారు. వైస్ ఎంపిపి పిసరి చిన్న భూమయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, బాదనవేణి రాజరాం, రామ్‌దాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు సీనియర్ నాయకుడి రాజీనామా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 27: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు సీనియర్ నాయకుడు చల్ల నారాయణ తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నారాయణ రెండు సార్లు మండల అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఇటీవల కాలం వరకు పనిచేశారు. పార్టీలో కొంత మంది నాయకులు అవలంబిస్తున్న తీరు, కష్టపడిన వారిని అణగదొక్కడం జరుగుతుందని అనేక సార్లు అధిష్టానం దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదన్నారు. తన రాజీనామాను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన శనివారం ప్రచార సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను గ్రామాల్లో ఎండగట్టాలన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్‌ను గత ఎన్నికల్లో ప్రజలు బొంద పెట్టారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలంబిస్తున్న కాంగ్రెస్, కుటుంబ పాలనను సాగించిన బీఆర్‌ఎస్ పార్టీకు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు పని చేయాలని కోరారు. అనంతరం నారాయణపూర్, రాగట్లపల్లి గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్ధతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు బుగ్గారెడ్డి, దేవేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి, కిరణ్‌నాయక్, రామచంద్రారెడ్డి, గణేశ్, శ్రీశైలం, రవి, రవినాయక్, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, కృష్ణహరి, ప్రశాంత్, ప్రకాశ్, రాజు, స్వామి, ఆంజనేయులు, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

రగుడులో తాటి, ఈత వనాలు దగ్ధం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 27 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయానికి ఎదురుగా పెంచుతున్న తాటి, ఈత వనాలు శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోతుంగా సకాలంలో అగ్నిమాపక అధికారులు చేరుకొని మంటలను ఆర్పివేశారు. దాదాపు 500 నుంచి వెయ్యి తాటి, ఈత చెట్లు కాలిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పర్శరాములుగౌడ్‌తోపాటు నాయకులు గుగ్గిళ్ల అజయ్‌గౌడ్, వంగ అనిల్‌కుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్ కోరారు.

బాధితుడి ఫిర్యాదు స్వీకరించడం లేదు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 27: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని ఓ పెట్రోల్ బంక్‌లో యజమాని వర్కర్‌పై దాడి చేస్తే ఫిర్యాదు చేయడానికి తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్‌హెచ్‌వో, ట్రైయినీ ఎస్సై రాహుల్‌రెడ్డి ఫిర్యాదును స్వీకరించడం లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ఆరోపించారు. బంక్ యజమాని వర్కర్‌పై దాడి చేశాడని ఫిర్యాదు చేయడానికి వెళ్లగా ఫిర్యాదు తీసుకోకుండా బాధితుని పక్షాన వెళ్లిన తమపై కూడా ఎస్‌హెచ్‌వో దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. బాధితునికి న్యాయం చేసి దాడి చేసిన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం

గంభీరావుపేట, ఏప్రిల్ 27: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి వెల్లడించారు. గంభీరావుపేటలో ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ మూడు ఎస్సీ రిజర్వేషన్ పార్లమెంటు నియోజకవర్గాల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కేటాయించక పోవడం శోచనీయమన్నారు. మాదిగల పల్లెలకు, వాడలకు కాంగ్రెస్ నాయకులను రానీయబోమన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన బీజేపీకే మా మాదిగల మద్దతు ఉంటుందన్నారు. ఈ నెల 29న కరీంనగర్‌లో జరిగే బహిరంగా సభకు మహాజన నేత మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు చెప్పారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కో కన్వీనర్లు పసుల బేస్‌కుమార్, నేరేళ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉన్నారు.

మండల టాపర్‌కు అభినందన

ముస్తాబాద్, ఏప్రిల్ 27 : మండలంలోని కొండాపూర్‌కు చెందిన క్యారం అక్షయ ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన సందర్భంగా శనివారం అభినందించారు. నామాపూర్ మోడల్ పాఠశాలలో చదివిన అక్షయ ఇంటర్ ఎంపీసీలో 959 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మాజీ సర్పంచ్ యారటి లక్ష్మీ, కాగ్రెస్ నాయకులు యారటి కరుణాకర్, దేవేందర్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ఆరెంజ్ జోన్‌లో సిరిసిల్ల



వెలవెలబోతున్న సిరిసిల్ల గాంధీచౌక్

- భగ్గుమంటున్న ఎండలు
- జిల్లాలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సిరిసిల్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వడగాలులు, భగ్గుమంటున్న ఎండ తీవ్రతతో సిరిసిల్ల ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఆరెంజ్ జోన్‌లోకే వెళ్లింది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 25.9, గరిష్ఠ ఉష్ణోగ్రత 44.8 డిగ్రీలుగా నమోదైంది. అధిక ఉష్ణోగ్రతతో సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రదేశాలు నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రతకు కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. వీధి వ్యాపారులు, మధ్యాహ్నం వేళల్లో అమ్మకాలను కొనసాగించడం లేదు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత స్టేషన్	గరిష్ఠం
కోనరావుపేట	మర్తనపేట	44.8
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	44.2
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	43.3
ఇల్లంతకుంట	కందికట్కూర్	42.2
చందుర్తి	మర్రిగడ్డ	43.9
కోనరావుపేట	నిజామాబాద్	43.3
సిరిసిల్ల	కలెక్టరేట్	43.3
సిరిసిల్ల	పెద్దూర్	42.6
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	43.2
బోయినపల్లి	బోయినపల్లి	43.1
వీర్నపల్లి	వీర్నపల్లి	43.1
రుద్రంగి	మానాల	42.8
రుద్రంగి	రుద్రంగి	42.6
వేములవాడ	నాంపల్లి	42.8
వేములవాడ రూరల్	వట్టెంల	42.6
వేములవాడ రూరల్	మల్లారం	42.1
గంభీరావుపేట	గంభీరావుపేట	42.5
గంభీరావుపేట	గజసింగవరం	42.1
ముస్తాబాద్	అవునూర్	42.4
ముస్తాబాద్	నామాపూర్	42.2

బండి సంజయ్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి గోపీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 27: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలో ఉన్న బండి సంజయ్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ కమిటీ సమావేశం పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, ఈ ప్రాంత ఎంపీగా బండి సంజయ్ కుమార్ చేసిన సేవలను ప్రజలకు వివరించాలని అన్నారు. పట్టణంలో బూత్‌ల వారిగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టాలని, ప్రతి ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని అన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేష్, కైలాస్, గజభీంకార్ చందు, బలగం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ అభ్యర్థి ఎంపీ బండి సంజయ్ కుమార్ గెలుపుకోసం సోషల్ మీడియాను ఉపయోగించాలని బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ సాగర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా స్థాయి సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కరెడ్ల మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువతతోపాటు ప్రజలందరు సోషల్ మీడియాపై ఆధారపడి ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోపాటు కేంద్రం ప్రభుత్వం చేసిన అభివృద్ధిని సోషల్ మీడియాలో వైరల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, వేణుగోపాల్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గరిపెల్లి ప్రభాకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కిరణ్‌నాయక్, సిరిసిల్ల పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిరిమల్లె మల్లేశం తదిరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వేములవాడ టౌన్, ఏప్రిల్ 27 : వేములవాడ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ బూర వజ్రవ్వ అన్నారు. వేములవాడ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ వజ్రావ్వ, జడ్పీటీసీ మ్యకల రవి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతి నిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సెస్ డైరెక్టర్‌హరిచరన్‌రావు, అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మానాలలో బీరప్ప ఉత్సవాలు

రుద్రంగి ఏప్రిల్ 27: రుద్రంగి మండలం మానాలలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రెటరీ జక్కు వంశీ, జక్కు మోహన్, జక్కుల లక్ష్మీనారాయణ, జలంధర్, గంగాధర్, కొమరయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

చందుర్తి ఏప్రిల్ 27 : చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మహమ్మద్ ఆసీఫ్‌ను గ్రామ యువకులు శనివారం సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1000 మార్కులకు 955 మార్కులు సాధించి చదువుపట్ల ప్రోత్సహించిన యువకుడి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పొంచెట్టి రాకేష్, మార్త రాజు, గుగ్గిళ్ల సాగర్, వెంగల వెంకటేష్, తిప్పని సతీష్, మర్రి శ్రీనివాస్, ఎండీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన కార్నర్ మీటింగ్

కోనరావుపేట, ఏప్రిల్ 27 : కోనరావుపేట మండల కేంద్రంలో మే 1న నిర్వహించే కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, మండల నాయకులు నాయని ప్రభాకర్ రెడ్డి, బాదనేని బాల్ రాజు, బాల్ రెడ్డి, ఉప్పుల గంగయ్య, ఎంపిటిసి చారి, పల్లె రవీందర్ రెడ్డి, నందు గౌడ్, గోపాల్ రావు, నీరటి సంజీవ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కోనరావుపేట, ఏప్రిల్ 27 : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని కోనరావుపేట ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామస్థులతో సీసీ కెమెరాల ఏర్పాటుపై శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీనివల్ల దొంగతనాలు, నేరాలను నియంత్రించవచ్చని అన్నారు. అనంతరం గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పలువురు డబ్బులు అందజేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 27 : వీర్నపల్లి మండలం కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లారపు దేవయ్య ఆధ్వర్యంలో మే డే కరపత్రాలను కార్మికులతో కలిసి ప్రజాప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగంలో పనిచేసే సంఘటిత అసంఘటిత కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో సీ ఐటీయూ అధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటుకు నరేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు రాజెల్లయ్య, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో ఇంటింటికీ పథకాలు



ప్రచారం నిర్వహిస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, ఏప్రిల్ 27 : బీఆర్‌ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కూరగాయాల మార్కెట్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. ప్రధాన రహదారితోపాటు కూరగాయాల మార్కెట్‌లో ప్రచారం చేపట్టారు.బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, నాయకులు శేఖర్‌గౌడ్, ఎగడండి స్వామి, భిక్షపతి, మాజీ సర్పంచ్ రాజు, కృష్ణమూర్తి, చిట్టంపల్లి రాజు తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కొలనూరులో శనివారం వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా కరీంనగర్ అభివృద్ధికి పాటుపడిన వినోద్ కుమార్‌ను అత్యధిక మెజారిటీ ఇవ్వాలన్నారు. ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఫాక్స్ చైర్మన్లు బండ నరసయ్య, రామ్మోహన్ రావు, తాళ్లపల్లి సతీష్, మాందాల శ్రీనివాస్, ముష్ఠం జీవన్ గౌడ్, గంగసాని రమణారెడ్డి, పవన్, బిట్ల బాబు, ప్రశాంత్, శ్రీనివాస్, తిరుపతి, పర్శరాములు ఉన్నారు.

రుద్రంగి: కరీంనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కూమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, నాగులపెల్లి రవి, చేప్యాల గణేష్, దయ్యాల నారాయణ, తదితరులు పాల్గోన్నారు.

తెలంగాణను ఆంధ్రాలో కలిపే ప్రమాదం



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, ఏప్రిల్ 27: కష్టపడి సాధించుకున్న తెలంగాణను తిరిగి ఆంధ్రాలో కలిపే ప్రమాదం ఉందని, టీడీపీ నేత చంద్రబాబు కనుసన్నల్లో రాష్ట్రంలో పాలన సాగుతోందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాటాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రాకుండా అడ్డుపడ్డ వాళ్లు ఈ రోజు కపట ప్రేమతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకించిన బీజేపీ నాయకులు మళీ కల్లబొల్లి మాటలతో ఓట్ల కోసం వస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మాయ మాటలను నమ్మి ఒకసారి ప్రజలు మోసపోయారని, మరోసారి మోసపోవద్దని అన్నారు. నీళ్ళు, కరంటు సమృద్ధిగా ఉన్నా సరైన ప్రణాళిక లేక రాష్ట్రంలో నీటి సమస్య, కరంటు సమస్య ఉత్పన్నమైందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ఎంపీపీ వంగ కరుణ, వైస్ ఎంపీపీ దోసల లత, పట్టణ అధ్యక్షుడు వెంకటి, నాయకులు దయాకర్‌రావు, రాజారాం, సురెందర్, లక్ష్మన్, లింగమ్‌యాదవ్, గంద్యాడపు రాజు, చేరాల వెంకటస్వామి, శేఖర్‌గౌడ్, వహీద్, కృష్ణమూర్తి, ఎగదండి స్వామి, రాజు, కుతూబ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 27 : కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో శనివారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల బాలయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్‌చౌదరి, కార్యదర్శి విష్ణునాథ్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బాలయ్య

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



సిరిసిల్లలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 27: సిరిసిల్ల పట్టణంలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం జిల్లా, సిరిసిల్ల పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల వద్ద జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిందం చక్రపాణి బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేసే బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. పోరాడి సాధించు కున్న తెలంగాణను రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ దేశం లోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిక సీట్లను గెలుచుకోవడం బీఆర్‌ఎస్‌కు అవసరమన్నారు. కాంగ్రెస్, బీజేపీ అమలుకాని హామీలను ఇస్తూ బీఆర్‌ఎస్‌పై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిందన్నారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ తిరుపతి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ఎంపీపీ వంగ కరుణసురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయలక్ష్మణ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్, వైస్ ఎంపీపీ దోసల లత, పట్టణ అధ్యక్షుడు వెంకటి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దయాకర్‌రావు, నాయకులు రాజారాం, శేఖర్‌గౌడ్, లింగమ్‌యాదవ్, గంద్యాడపు రాజు, వెంకటస్వామి, వహీద్, కుతూబ్, బాలకిషన్‌రావు, శివయ్య మీనయ్య, రాజు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద గులాబీ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కురాజు శ్రీనివాస్, ఆర్‌బీఎస్ మాజీ మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, మాజీ సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు, గాడిచర్ల దేవయ్య, సుమతి, నల్ల నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి, చెవుల మల్లేశ్, సంతోష్‌రావు, గుండవేని సతీశ్, విశ్వనాథం, కంచం నర్సింలు, కారంగుల వెంకట్రావు,శరయ్య, శీలం స్వామి, ముక్క మల్లయ్య, పరశరాములు తదితరులు పాల్గొన్నారు.

జనతా వస్త్ర పథకంతో ఉపాధి కల్పించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 27 : సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జనతా వస్త్ర పథకాన్ని ప్రవేశ పెట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఐదుగురు కార్మికుల కుటుంబాలతో కలిసి సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలను ఆపాలని, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యచేసుకున్న ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ రూ.18 కోట్లు వెంటనే అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గతంలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు కారణమైతే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నేతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తోందన్నారు. అనంతరం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అంకారపు మల్లేశం కుటుంబాన్ని పరామర్శించారు. అదే సమయంలో మల్లేశం కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సీఐటీయూ నాయకులు కలిసి సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు ఉపాధి ఇతర సమస్యలపై వారితో మాట్లాడారు. నేతన్నలను ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, జవ్వాజి విమల, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుడిక్యాల కనకయ్య కూచన శంకర్, కంది మల్లేశం, సందుపట్ల పోచమల్లు, వెంకటేశం, రాజు, ప్రవీణ్, సంపత్, సతీష్, శంకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.